క్లుప్తంగా

బహిరంగ వేలం

కాజులూరు: మండలంలోని కోలంకలో కొబ్బరి చెట్ల ఫలసాయానికి బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ రాంబాబు తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, గ్రామంలోని ప్రభుత్వ భూముల్లో ఉన్న కొబ్బరి చెట్లను నాలుగు విభాగాలుగా విభజించి వేలంపాట నిర్వహించటం జరుగుతుందన్నారు. పాటలో పాల్గొనాలనుకునే వారు ముందుగా రూ.5 వేలు ధరావత్తు చెల్లించాలని, హెచ్చు పాటదారుడు సదరు పాట మొత్తానికి సాల్వెన్సీ సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉందన్నారు. 3 ఏళ్ల కాలపరిమితికి వేలంపాట జరుగుతుందన్నారు.

కుంగ్ ఫూ మాస్టర్‌కి సత్కారం

కపిలేశ్వరపురం (మండపేట): ఇటీవల బోధి ధర్మ అవార్డు పొందిన మండపేట మండలం ద్వారపూడికి చెందిన వారియర్ మాంక్స్ కుంగ్ ఫూ అధ్యక్షుడు, సీనియర్ మాస్టర్ కోలా మురళీకృష్ణను మంగళవారం గ్రామస్తులు సత్కరించారు. కార్యక్రమంలో టేకి సతీష్, వీరబాబు, తెల్లాకుల శివప్రసాద్, పేపకాయల శ్రీనివాస్ పాల్గొన్నారు.

విశేష అలంకరణలో వినాయకుడు



కపిలేశ్వరపురం (మండపేట): మండలంలోని కేశవరంలో శ్రీవరసిద్ధి వినాయక స్వామిని వేదపండితులు విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద గణపతి నవరాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం అన్నదానం నిర్వహించారు. గ్రామంతో పాటు సమీప ప్రాంతాల భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

రైతులు అవగాహన పెంచుకోవాలి

కాజులూరు: నానో యూరియా వాడకంపై రైతులు అవగాహన పెంచుకోవాలని గొల్లపాలెం పీఏసీఎస్ చైర్మన్ అంగర కృష్ణ అన్నారు. మంగళవారం గ్రామంలో ఏఈఓ పీవీ శ్రీనివాసవర్మ ఆధ్వర్యంలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అంగర కృష్ణ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, పొలంలో అడుగు లోతుకు పైబడి వానపాములు వంటి జీవులు జీవిస్తాయన్నారు. ఇవి భూసారం పెంపొందించేందుకు ఎంతగానో దోహదపడతాయన్నారు. యూరియా పొలాల్లో అధికంగా వేయటం ద్వారా రైతు నేస్తాలుగా పిలుసుకునే ఈ వానపాములు నశిస్తున్నాయన్నారు. ఫలితంగా భూసారం తగ్గిపోతుందన్నారు. రైతులు యూరియా వాడకాన్ని తగ్గించి దాని స్థానంలో నానో యూరియాను వినియోగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కడియాల శివప్రసాద్, గుబ్బల అబ్బులు, తదితర రైతులు పాల్గొన్నారు.

సామూహికంగా ఎలుకల నిర్మూలన చేపట్టాలి

మామిడికుదురు: రైతులు సామూహికంగా ఎలుకల నిర్మూలన చేపట్టాలని ఏఓ ఎన్‌వీవీ సత్యనారాయణ సూచించారు. నగరంలో రైతులకు ఉచితంగా ఎలుకల నిర్మూలన మందును మంగళవారం పంపిణీ చేశారు. రెవెన్యూ ఇనస్పెక్టర్ ఇబ్రహీమ్, పంచాయతీ కార్యదర్శి సురేష్, వీఆర్వో శ్రీనివాస్, స్థానికులు జాలెం సుబ్బారావు, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

65 మందికి కంటి వైద్య పరీక్షలు

పి.గన్నవరం: ముంగండలో మంత్రవాది ఇందిరాకుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 65 మందికి కంటి పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. వారిలో 13 మందికి ఉచితంగా ఆపరేషన్లు చేయాలని నిర్ధారించినట్టు హోమియో వైద్యుడు ఖండవిల్లి నాగేశ్వరరావు తెలిపారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి వైద్య బృందం సేవలందించారు.

మహిళలు వ్యవసాయంలోనూ రాణించాలి

మలికిపురం: మహిళలు వ్యవసాయ రంగంలోనూ రాణించాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. నియోజకవర్గంలోని 117 మహిళా రైతు సంఘాలకు కేంద్రం ద్వారా సెర్ప్ నుంచి మంజూరైన రూ.11.70 లక్షల రివాల్వింగ్ ఫండ్‌ను మంగళవారం ఆయా సంఘాలకు ఎమ్మెల్యే విశ్వేశ్వరాయపురంలోని క్యాంపు కార్యాలయం వద్ద అందించారు. 68 మందికి రూ.65.15 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందించారు. ఏపీ మార్క్ ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, ఎంపీపీ మేడిచర్ల వెంకటసత్యావాణి, ఏఎంసీ చైర్మన్ కేతా వెంకట లక్ష్మి, మహిళా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ

పి.గన్నవరం: మానేపల్లి బాలికోన్నత పాఠశాలలో చదువుతున్న 20 మంది క్రీడాకారులకు హెచ్‌ఎం కేవీ సూర్యనారాయణ మూర్తి మంగళవారం రూ.10 వేల విలువైన క్రీడా దుస్తులను అందజేశారు. తన తండ్రి కొమ్మాజోస్యుల వెంకటసుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం వీటిని అందించినట్టు మూర్తి వివరించారు. ఆయనను ఎస్‌ఎంసీ చైర్ పర్సన్ కొమ్ముల రమాదేవి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

పోరు బాట.. సక్సెస్

- కూటమి అన్యాయాలపై రోడ్డెక్కిన రైతులు
- ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా నినాదాలు
- ఆర్డీవోకు వినతిపత్రం ఇచ్చిన వైఎస్సార్ సీపీ నేతలు



రామచంద్రపురంలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న కో–ఆర్డినేటర్ సూర్యప్రకాశ్, జక్కంపూడి విజయలక్ష్మి తదితరులు



రామచంద్రపురం ఆర్డీవో అఖిలకు వినతిపత్రం అందిస్తున్న సూర్యప్రకాశ్ తదితరులు

రామచంద్రపురం: రైతులకు అందాల్సిన యూరియాను కూటమి ప్రభుత్వ నాయకులు బ్లాక్ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు, రామచంద్రపురం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు మంగళవారం అన్నదాత పోరు కార్యక్రమంలో భాగంగా కో–ఆర్డినేటర్ సూర్యప్రకాశ్ నేతృత్వంలో రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో గాంధీ పేటలోని పార్టీ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి గుండా ప్రభుత్వ రైతు వ్యతిరేక చర్యలకు నిరసన వ్యక్తం చేస్తూ ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. ప్రభుత్వం రైతుల పట్ల వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ, వెంటనే రైతు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆర్డీవో డి.అఖిలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పార్టీ పరిశీలకురాలు, పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి హాజరయ్యారు.

- పార్టీ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ, రైతులు తమ సమస్యలపై ఎన్నడూ రోడ్డు ఎక్కరని, రైతు అంటే సౌమ్యంగా ఉంటారని, అటువంటి వారు తమ సమస్య పరిష్కారానికి రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితులను ఈ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. రైతులకు అండగా ఉంటామని చెబుతున్న ఈ ప్రభుత్వం వారిని అన్ని విధాలుగా మోసం చేసిందని విమర్శించారు.
- పార్టీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ సూర్యప్రకాశ్ మాట్లాడుతూ, రూ.220 ఉండాల్సిన యూరియా బస్తా కూటమి ప్రభుత్వ నిర్వాహక చర్యలు మూలంగా ఆరు వందలకు పైగా మార్కెట్‌లో అమ్ముతున్నారని విమర్శించారు. రైతులకు ఇవ్వాల్సిన ఇన్సూరెన్స్‌ను కూడా ఇవ్వకుండా వారిని నిలువునా ఈ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఎన్నికల సమయంలో రైతులను ఆదుకుంటామని, రైతు భరోసాను అందిస్తామని ప్రకటనలు చేసిన కూటమి ప్రభుత్వం రైతులను మోసం చేస్తూ కేవలం రూ.5వేలు మాత్రమే ఇచ్చి మాట తప్పిందన్నారు. 2019 ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు ఇచ్చిన హామీ మాత్రమే కాకుండా, ఇచ్చిన మాటకు మించి రైతులకు రూ.2వేలు అదనంగా అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనన్నారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఆర్డీవోకు వినతిపత్రం అందించామన్నారు.
- పార్టీ రైతు విభాగం రాష్ట్ర నాయకుడు కొవ్వూరి త్రినాథ్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవట్లేదన్నారు. యూరియా కోసం రోజులు తరబడి క్యూలైన్‌లలో పడిగాపులు కాస్తుంటే చీమ కుట్టినట్టు కూడా లేదన్నారు. నారుమడి దగ్గర నుంచి పంట మాసూళ్ల వరకు రైతులు గత ఏడాదిన్నరగా సమస్యలు ఎదురవుతున్నా.. కూటమి ప్రభుత్వం మాత్రం వాటిపై దృష్టి సారించటం లేదన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తరువాత రైతులు అన్ని విధాలుగా కుదేలయ్యారన్నారు. తక్షణం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పెమ్మిరెడ్డి మురళీకృష్ణ, ఎంపీపీ అంబటి భవానీ, వైఎస్‌ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు యల్లమిల్లి సతీష్‌కుమారి, ఆర్యాపురం కో–ఆపరేటివ్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ మల్లిడి సాయిలక్ష్మి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందు, పార్టీ పట్టణ, మండల కన్వీనర్‌లు గాదంశెట్టి శ్రీధర్, పోలినాటి వరప్రసాద్, పార్టీ నేతలు పెట్టా శ్రీనివాసరావు, పెంటపాటి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కాజులూరు, కె.గంగవరం, రామచంద్రపురం మండలాలకు చెందిన రైతులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

ప్రభుత్వ తీరుపై కన్నెర్ర జేసిన నాయకులు, రైతులు

కపిలేశ్వరపురం: కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి రైతుకు దినదినగండంలా మారింది. తాము అధికారంలోకి రాగానే రైతుకు మహర్దశ పట్టిస్తామంటూ వివిధ రకాల హామీలను గుప్పించారు. నేరుగా అప్పటి కూటమి పార్టీల అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ అన్నదాతలను ఆకట్టుకునేలా ప్రసంగాలు చేశారు. కారణమేదైతేనేమి కూటమి ప్రభుత్వం వచ్చింది. ఏడాది కాలం రైతును పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రతి పంటకూ ప్రతిబంధకాలే. ప్రస్తుత పంటకు యూరియా కొరత రూపంలో సమస్య. విసుగు వేసారిన రైతులు ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నారు. వారికి మద్దతుగా వైఎస్సార్ సీపీ నిలిచింది. అన్నదాత పోరు పేరుతో మంగళవారం మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో రైతు నిరసన హోరెత్తింది.

మండపేట నియోజకవర్గ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆదేశాలతో ఆయన తనయుడు తోట పృథ్వీరాజ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. మండపేటలోని పార్టీ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు, మహనీయుల విగ్రహాల సెంటర్, కలువపువ్వు సెంటర్, కేపీ రోడ్డు మీదుగా రామచంద్రపురం ఆర్డీఓ కార్యాలయానికి బైక్ ర్యాలీ నిర్వహించారు. మండపేట పట్టణం, రూరల్ మండలంలోని 12 గ్రామాలు, కపిలేశ్వరపురం మండలంలోని 19 గ్రామాల రైతులు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు మండపేట శివారు మీదుగా రామచంద్రపురం బయలుదేరారు. మాచవరం, పసలపూడి గ్రామాల వద్ద రాయవరం మండలంలోని 12 గ్రామాల రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీలో కలిశారు. అక్కడ నుంచి రామచంద్రపురం ఆర్డీఓ కార్యాలయం వరకూ పెద్ద ఎత్తున నిరసన నినాదాలు చేశారు. ఆర్డీఓ కార్యాలయం వద్ద పార్టీ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, రామచంద్రపురం కో–ఆర్డినేటర్ పిల్లి సూర్య ప్రకాశ్, రైతు విభాగ నేత కొవ్వూరి తినాథరెడ్డిలతో కలిసి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. అన్నదాతల సమస్యలను వినతిపత్రం రూపంలో ఆర్డీఓ అఖిలకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు పుట్టపూడి అబ్బు, కురుపూడి భవాని, నల్లమిల్లి మంగాతాయారు, ఎంపీపీ నౌండ్రు వెంకటరమణ, మున్సిపల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండపేట పట్టణ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్, రూరల్ కమిటీ అధ్యక్షుడు అడబాల బాబ్జి, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల అధ్యక్షులు గూటం సత్యనారాయణ, వెలగల సత్యనారాయణరెడ్డి, నాయకులు సిరిపురపు శ్రీనివాస్, నక్కా సింహాచలం, పలివెల మధు, పలివెల సుధాకర్, షేక్ ఆలీఖాన్ బాబా పాల్గొన్నారు.



మండపేటలోని బైక్ ర్యాలీలో పాల్గొన్న పృథ్వీరాజ్, దుర్గారాణి తదితరులు



మండపేటలో ర్యాలీని ప్రారంభిస్తున్న నాయకులు

చిరుపొట్ట దశలో వరి పంట



పొలంబడి సమావేశంలో మాట్లాడుతున్న ఏవో రమేష్‌కుమార్

రాయవరం: ప్రస్తుతం వరి పంట చిరుపొట్ట దశలో ఉందని, ఈ సమయంలో మూడో దఫా ఎరువులుగా యూరియా, పొటాష్ వాడాలని ఏఓ రమేష్‌కుమార్ రైతులకు సూచించారు. మండల ప్రత్యేకాధికారి దొరబాబు, తహసీల్దారు ఐపీ శెట్టి, రమేష్‌కుమార్‌తో కూడిన బృందం సోమేశ్వరం, మాచవరం గ్రామాల్లో పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్నారు. యూరియా రైతులకు అందుబాటులో ఉందని తెలిపారు. యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా మార్కెట్లో అందుబాటులో ఉందని, నానో యూరియాను పురుగుమందుల్లో కలుపుకొని పిచికారీ చేయవచ్చని ఏవో తెలిపారు. రసాయన ఎరువులు వాడకం తగ్గించేందుకు మిశ్రమ అపరాల విత్తనాలు తొలకరి పంట కోతల సమయంలో వేసి భూమిలో కలియదున్నాలని, తద్వారా దాళ్వా పంటకు అవసరమయ్యే ఎరువుల పరిమాణం తగ్గించే ప్రయత్నం చేయాలని తెలిపారు. మిశ్రమ అపరాల విత్తనాలు ఎకరానికి సుమారు రూ.700 ఖర్చు అవుతుందని తెలపగా, ప్రభుత్వమే రాయితీపై ఇప్పించాలని రైతులు కోరారు. కార్యక్రమంలో మాచవరం సర్పంచ్ కత్తుల సీతామహాలక్ష్మి, సొసైటీ చైర్మన్ మేడపాటి రవీంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ కుల సర్టిఫికెట్లపై చర్యలు తీసుకోవాలి



రాయవరంలో తహసీల్దారుకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రాయవరం: బీసీ కులాల జాబితాలో ఉన్న కొన్ని కులాల వారు ఎస్టీ సర్టిఫికెట్లు పొందుతున్నారని, అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎరుకల సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. సంఘం చెల్లూరు శాఖ అధ్యక్షుడు గాడ పట్టాభి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించిన అనంతరం తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ఎరుకల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి మానుపాటి రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు మానుపాటి గోవింద్, కార్యదర్శి పాపారావు, తూర్పుగోదావరి జిల్లా క్రమశిక్షణ కమిటీ అధ్యక్షుడు వల్లపు ప్రసాద్, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు సంగడాల వెంకటరమణ తదితరులు మాట్లాడారు. ఎరుకుల సామాజికవర్గం ఎస్టీ జాబితాలోకి వస్తుందని, అర్హులు కాని కొన్ని సామాజికవర్గాలకు చెందిన వారు ఎస్టీ సర్టిఫికెట్లు పొందడం వల్ల తమకు అన్యాయం జరుగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని నిరసన చేశారు. అనంతరం తహసీల్దారు ఐపీ శెట్టికి వినతి పత్రం అందజేశారు.

ఒప్పందాల ఉల్లంఘనపై ఫిర్యాదు



ఆలమూరులో ఎస్సైకు వినతిపత్రం అందజేస్తున్న ఓఎన్‌జీసీ బాధిత రైతులు

ఆలమూరు: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఓఎన్‌జీసీ గతంలో చేసుకున్న ఒప్పందాలను ఉల్లంఘిస్తోందని మండలంలోని పెదపళ్ల రైతులు ఆరోపించారు. మంగళవారం ఆగ్రామ రైతులు మండల ప్రజా పరిషత్, తహసీల్దార్, పోలీసు స్టేషన్ కార్యాలయాల్లోని మండలస్థాయి అధికారులకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ గతేడాది అక్టోబర్ 15న ఉన్నతాధికారుల సమక్షంలో ఓఎన్‌జీసీ 15.52 ఎకరాలను భూసేకరణ ఒప్పందం చేసుకుందన్నారు. ఇప్పటికే ఏడాది కావస్తున్నా ఇంకా ఓఎన్‌జీసీ అధికారులు రైతులకు పరిహారం చెల్లించకపోగా భూసేకరణపై స్పందించడడం లేదని ఆవేదన చెందారు. దీనిపై ఎంపీడీఓ ఏ రాజు, తహసీల్దార్ కేజే ప్రకాష్‌బాబు, ఎస్సై జి.నరేష్ స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఓఎన్‌జీసీ స్పందించని పక్షంతో ఈనెల 12 నుంచి ఆలమూరు నుంచి గుమ్మిలేరు వెళ్లే రోడ్డులోని మండపేట జీసీఎస్ వద్ద ధర్నా నిర్వహిస్తామని తెలిపారు.

ప్రభుత్వ శాఖల భవనాలకు పన్ను బకాయిలు

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీ పరిధిలో 54 రాష్ట్ర ప్రభుత్వ, ఒక కేంద్ర ప్రభుత్వ భవనాలకు సంబంధించి ఆస్తి పన్ను బకాయిలు పేరుకుపోయాయని కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ తెలిపారు. ఇప్పటికే అనేకసార్లు ఆ ప్రభుత్వ భవనాల అధికారులకు బకాయి పన్నులు చెల్లించాలని కోరినా ఫలితం లేదని పేర్కొన్నారు. దీంతో శాఖల వారీగా బకాయిల జాబితాలను సిద్ధం చేసి కలెక్టర్ మహేష్‌కుమార్‌కు నివేదిక అందించినట్టు తెలిపారు. అవసరమైతే మున్సిపాలిటీ ఆన్‌లైన్ చెల్లింపులు, త్రైమాసిక వాయిదా సదుపాయం కల్పించడానికి సిద్ధంగా ఉన్నామని కమిషనర్ స్పష్టం చేశారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి



కె.గంగవరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆటో యూనియన్ సభ్యులు



రామచంద్రపురంలో ర్యాలీ చేస్తున్న ఆటో డ్రైవర్లు

రామచంద్రపురం: మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యం కల్పించటంతో ఆటో డ్రైవర్ల రోడ్డున పడ్డారని, ఆటో వర్కర్లను ప్రభుత్వం ఆదుకోవాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు నూకల బలరాం, రామచంద్రపురం టౌన్ ప్రెసిడెంట్ ఆకుమర్తి సూరిబాబు, టౌన్ సెక్రటరీ ఖండవల్లి పార్థు తదితరులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రామచంద్రపురం ప్రధాన రహదారిలో ఆటోలతో డ్రైవర్లు, వర్కర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ, ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించిన నేపథ్యంలో ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఏడాదికి ప్రతి ఆటో డ్రైవర్‌కి వాహనమిత్ర పథకం ద్వారా రూ.30 వేలు ఇవ్వాలన్నారు. వాహన కొనుగోలుకు బ్యాంకుల ద్వారా రూ.4 లక్షల సబ్సిడీతో కూడిన వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలన్నారు. వాహన ఫిట్నెస్ ప్రభుత్వమే నిర్వహించాలని, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో టౌన్ నాయకులు, పసలపూడి ప్రెసిడెంట్ గోపి, ద్రాక్షారామ బోస్ బొమ్మ సెంటర్ ప్రెసిడెంట్ జ్యోతిబాబు, టౌన్ ప్రెసిడెంట్ సత్యనారాయణ రామచంద్రపురం, ద్రాక్షారామ, పసలపూడి, చెల్లూరు, వెంటూరు ఆటో కార్మికులు భారీగా పాల్గొన్నారు.

కె.గంగవరం: ఆటో నడుపుకుంటూ భార్య పిల్లలలో జీవనం సాగిస్తున్న తమకు ఫ్రీబస్సు కారణంగా పస్తులు ఉండడంతోపాటు, జీవనం కష్టంగా ఉందని మండల ఆటో యూనియన్ సభ్యులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని పామర్రు నుంచి కె.గంగవరం వరకు ఆటోలతో కార్మికులు నిరసన వ్యక్తం చేసి స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి వినతిపత్రాన్ని తహసీల్దార్ ప్రసాద్‌కు అందించారు. వారు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం నమ్మించి ఆటో కార్మికులను నట్టేట ముంచిందని ఆవేదన చెందారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సంవత్సరానికి రూ.10వేలు ఇచ్చి ఆర్థికంగా అందుకుందని, ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఏడాదికి రూ.20వేలు ఇస్తామని నమ్మించి ఓట్లు దండుకున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చి ఆటో కార్మికులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ బొంగ అజయ్‌కుమార్, యూనియన్ నాయకులు బత్తుల సత్యనారాయణ, వాసంశెట్టి శ్రీనివాస్, గెద్దాడ సతీష్, స్వర్ణదుర్గ ఆటో యూనియన్ సభ్యులు, వినాయక ఆంజనేయ ఆటో యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సేవా పక్వాడ్ పక్షోత్సవాలు


రామచంద్రపురం రూరల్: మండలంలోని హసన్‌బాద గ్రామ గ్రంథాలయంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ అధ్యక్షతన మంగళవారం జిల్లా సేవా పక్వాడ కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సేవా పక్వాడ కన్వీనర్ కో–కన్వీనర్లతో వర్క్ షాప్ నిర్వహించారు. ఈనెల 17న ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని సేవా పక్వాడ్–2025 పక్షోత్సవాలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ సోము వీర్రాజు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, మోదీ ప్రవేశపెట్టిన వికసిత భారత్, ఆత్మ నిర్భర్ భారత్, డిజిటల్ ఇండియా గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ సతీష్ రావు, మండల అధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ తదితరులు ఎమ్మెల్సీని సత్కరించారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా బీజేపీ ఇంచార్జి కర్రి చిట్టిబాబు, రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్, జిల్లా ప్రధానకార్యదర్శి సలాది వీరబాబు, మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

యూరియా పూర్తి స్థాయిలో అందిస్తాం

సాక్షి ఇంపాక్ట్

కె.గంగవరం: 'పామర్రులో యూరియా కొరత తీర్చాలి' శీర్షికతో మంగళవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి వ్యవసాయ శాఖ అధికారులు స్పందించారు. స్థానిక ఏఓ సద్గురు మూర్తి మాట్లాడుతూ, గ్రామంలో యూరియా బస్తాలు రైతులకు అందించకపోవడానికి గల కారణాన్ని తెలిపారు. సొసైటీ లైసెన్సును గతంలో రద్దు చేశామని, ఇప్పటివరకు పాలకవర్గం లేకపోవడం వల్ల లైసెన్సు పునరుద్ధరీకరించలేదన్నారు. దీంతో పాటు రైతు సేవా కేంద్రాలకు తగిన నిల్వ కేంద్రాలు లేకపోవడం వల్ల ఇబ్బంది ఎదురైందని పేర్కొన్నారు. ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా వ్యవసాయ శాఖ సిబ్బంది బదిలీపై వెళ్లిపోవడం వారి స్థానంలో కొత్తవారు రావడం వల్ల వారి ఆధార్, సెల్ నెంబర్ మార్పు అవ్వడంతో ఇండెంట్ రూపంలో పెట్టలేకపోయామన్నారు. అయినప్పటికీ రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రతి రైతుకు అందేలా యూరియాను అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు.

5కే మారథాన్ రన్‌లో కొత్తపేట విద్యార్థులకు బహుమతులు



అమలాపురంలో రూ.10 వేలు చెక్కు అందుకుంటున్న విజేత మురళి

కొత్తపేట: వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అమలాపురంలో మంగళవారం నిర్వహించిన 5కే మారథాన్ రన్‌లో కొత్తపేట వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచి నగదు బహుమతులు పొందినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు తెలిపారు. యువతలో హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన పెంచేందుకు జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ, ఎయిడ్స్, అండ్ లెప్రసీ అధికారిణి డాక్టర్ భరతలక్ష్మి ఆధ్వర్యంలో 5కే మారథాన్ రన్ నిర్వహించారు. కొత్తపేట డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్ నాగేంద్రమురళి ప్రథమ స్థానంలో నిలిచి రూ.10 వేలు, బీఎస్ఆర్ రాజు ద్వితీయ స్థానంలో నిలిచి రూ.7 వేలు, మహిళల విభాగంలో వైపీఎస్‌డీ సంతోషి ద్వితీయ స్థానంలో నిలిచి రూ.7 వేలు పొందారు. విజేతలను కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ టీ రమాదేవి, ఎన్ఎస్ఎస్ పీఓ డీసీహెచ్ పాపారావు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌చార్జ్ డాక్టర్ కె.అంకమరావు, పీడీ కే కనక రాజు, అధ్యాపకులు అభినందించారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

రావులపాలెం: అగ్నిప్రమాదంలో ఇల్లు కాలిపోయి సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు అండగా నిలిచి సుమారు రూ.60 వేలు విలువైన సాయాన్ని అందజేశారు. ఊతకోటకు చెందిన కొల్లి సత్యవతి ఇల్లు ఆదివారం దగ్ధమవడంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. శ్రీ కాశీ అన్నపూర్ణా దేవి సేవా సంస్థ సభ్యులు స్పందించి మంగళవారం ఊతకోటలో సత్యవతి కుటుంబానికి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.30,116 చెక్కును, మరో రూ.30 వేలు విలువైన 55 కేజీల బియ్యం, పెద్ద మంచం, నాలుగు మడత మంచాలు, పరుపులు, తలగడలు, ఫ్యాన్, రెండు కుర్చీలు, బియ్యం పెట్టె, నిత్యావసర సరుకులు, కొత్త బట్టలు, వంట సామాన్లు అందజేశారు. సత్యవతి కుటుంబ సభ్యులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

అవార్డు గ్రహీత ప్రభావతికి అభినందనలు

సఖినేటిపల్లి: సఖినేటిపల్లిలంక జెడ్పీ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గుండేపల్లి ప్రభావతిని అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమెను, ఎంపీడీవో కె.సూర్యనారాయణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, ఎంపీటీసీ మందపాటి రత్నం అభినందించారు. నల్లి సురేంద్ర, మందపాటి సత్యనారాయణ, చెంపాటి రామకృష్ణంరాజు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.